యూరియా అమ్మకాలపై నిఘా

- పక్కదారి పట్టకుండా ముమ్మర తనిఖీలు
- జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు
- ఎకరానికి ఒక యూరియా బస్తా
- ఇప్పటి వరకు 21,581 టన్నుల యూరియా సరఫరా
- పక్కదారి పడుతున్న 140 బస్తాల యూరియా పట్టివేత



సుల్తానాబాద్ సహకార సంఘం గోదాంలో ఎరువులను పరిశీలించిన కలెక్టర్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో యూరియా కొరతతో రైతులు అల్లాడుతుండగా, జిల్లాలో ఆ పరిస్థితి తలెత్త కుండా అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. యూరియా అమ్మకాలపై నిఘా ఏర్పాటు చేసింది. నెల వారీ కోటా ప్రకారం రావాల్సిన యూరి యాను ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి సరఫరా చేసుకుం టున్నారు. ఇప్పటి వరకు జిల్లాకు 21,581 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు సరఫరా కాగా, 18,991 టన్నుల యూరియాను రైతులకు విక్రయించారు. ప్రస్తు తం మార్కెట్‌లో 2,590 టన్నుల యూరియా అందు బాటులో ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ యూరియా పక్కదారి పట్టకుండా ఉండేందుకుగాను కలెక్టర్ సహా, జిల్లా వ్యవసాయ శాఖాధికారులు ప్రాథ మిక వ్యవసాయ సహకార సంఘాలు, ఎరువుల దుకా ణాలను రెండు రోజులుగా ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. అలాగే జిల్లా సరిహద్దుల నుంచి ఇతర జిల్లాలకు యూరియాను తరలించకుండా ఉండేం దుకు నాలుగు చోట్ల మంథని నియోజకవర్గ పరిధిలోని మంథని మండలం సుందిళ్ల బ్యారేజీ, అడవి సోమన్ పల్లి, ముత్తారం మండలం ఖమ్మంపల్లి, పెద్దపల్లి నియో జకవర్గ పరిధిలోని ఓదెల మండలం గుంపుల వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఒక్కో చెక్‌పోస్టులో పోలీస్, వ్యవసాయ, సహకార, రెవెన్యూ, మార్కెటింగ్, పంచా యతీరాజ్ శాఖలకు చెందిన ఆరుగురు సిబ్బందిని నియమించారు. ఈ చెక్ పోస్టులు రెండు రోజుల నుంచి పని చేస్తున్నాయి. బు ధ, గురువారాల్లో మంథని ప్రాంతం నుంచి మంచి ర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు తరలిస్తున్న 140 యూరియా బస్తాలను సుందిళ్ల బ్యారేజీ, అడవి సోమన్‌పల్లి చెక్ పోస్టుల వద్ద వ్యవసాయ శాఖాధికారులు పట్టుకున్నారు.

● జిల్లా అవసరాలకు 28,195 టన్నులు అవసరం..

వానాకాలం సీజన్‌లో జిల్లాలో రైతులు 2,76,076 ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, తదితర పంటలను సాగు చేస్తారని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. ఆ మేరకు 2020 నుంచి 2024 సంవత్సరం జిల్లాలో రైతులు వినియోగించిన యూరియా ప్రకారం 28,195 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని అంచనా వేశారు. ఒకవేళ అంతకు మించితే 32,447 టన్నుల యూరియా అవసరం ఉంటుంది. ఆ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఎకరం వరి 2 బస్తాలు (45 కిలోలు), పత్తికి 3 బస్తా లు, మొక్కజొన్న పంటకు 3 బస్తాల యూరియా అవస రం ఉంటుందని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు జిల్లాలో 2,49,782 ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, కంది, తదితర పంటలను రైతులు సాగు చేశారు. ఇందులో వరి 2,00,316 ఎకరాలు, పత్తి 48,937 ఎకరాలు, మొక్కజొన్న 430 ఎకరాలు, తదితర పంటలను సాగు చేశారని వ్యవసాయ శాఖాధికారులు పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకు మరో 15 వేల ఎకరాల్లో వరి నాట్లు వేయవచ్చని జిల్లా వ్యవసాయ శాఖాధికారి బత్తిన శ్రీనివాస్ చెబుతున్నారు. జిల్లాలో సాగయ్యే పంటలకు తోడు అదనపు అంచనాల ప్రకారం 32,447 టన్నుల్లో

(మిగతా 8వ పేజీలో)

సరిహద్దులు దాటుతున్న యూరియా..

మంథనిరూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం మంథని ప్రాంతానికి కేటాయించిన యూరియా జిల్లా దాటి ఇతర జిల్లాలకు తరలిపోతున్నది. దీంతో ఈ ప్రాంత రైతులు యూరియా కోసం రోజు ఇబ్బదులకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలోని ఫెర్టిలైజర్ షాపులకు కేటాయించిన యూరియా ఇతర ప్రాంతాలకు తరలి పోతుండటంతో మంథని ప్రాంత రైతులు యూరియా కోసం రోజు ఇబ్బందులకు గురవుతుండటంతో స్పందించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష సిబ్బందితో రెండు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. మంథని మండలం సరిహద్దులలో మంచిర్యాల. భూపాలపల్లి జిల్లాలు ఉండటంతో యూరియా ఆ జిల్లాలకు అక్రమంగా తరలి పోతుందనే సమాచారం మేరకు మంథని మండలంలోని సిరిపురం సమీపంలోని సుందిళ్ల బ్యారేజి వద్ద, భూపాలపల్లి జిల్లాకు సరిహద్దుల్లో అడవిసోమన్‌పల్లి వద్ద అధికారులు చెక్ పోస్టులు బుధవారం ఏర్పాటు చేశారు. రెండు రోజుల్లో చెక్ పోస్టుల వద్ద అక్రమంగా ఇతర జిల్లాలకు తరలిసున్న యూరియా, వాహనాలు పట్టుకున్నారు. దీంతో ఈ సీజన్‌లో ఎంత యూరియా జిల్లాల సరిహద్దులు దాటిందో అర్థమవుతుంది. వర్షాకాలం సీజను మొదట్లో అధికారులు స్పందించి చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తే పెద్ద ఎత్తున్న యూరియా అక్రమ రవాణా అరికడితే మంథని ప్రాంతం రైతులకు యూరియా కష్టాలు వచ్చే ప్రమాదం తప్పేది. ఈ రెండు చెక్ పోస్టుల వద్ద సిబ్బంది రెండు రోజుల్లో ఆరు వాహనాలలో తరలిస్తున్న 140 యూరియా బస్తాలను సిబ్బంది పట్టుకున్నారు. పట్టుబడ్డ వాహనాలు, యూరియా బస్తాలను అధికారులు సీజు చేసి విచారణ జరుపుతున్నారు. అధికారులు ఈ వ్యవహారంపై లోతుగా విచారణ జరిపితే అక్రమంగా యూరియాను ఇతర జిల్లాలకు అమ్ముకున్న పెర్టిలైజర్ షాపుల వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.



అధికారులు పట్టుకున్న యూరియా ట్రాక్టర్

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమ మట్టి దందా

● రెండు ఎక్స్‌కవేటర్ల సీజ్

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తుర్కలమద్దికుంట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమంగా మట్టి దందాకు పాల్పడుతున్నారు. అనుమతులు లేకుండా రెండు ఎక్స్‌కావేటర్ల ద్వారా గుట్ట నుంచి మట్టిని తరలిస్తుండగా మైనింగ్ అధికారులు పట్టుకొని పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అధికారులు రావడం గమనించిన డ్రైవర్లు వాహనాలు వదిలేసి వెళ్ళిపోయారు. వాహనాల యజమానులు అక్కడకు చేరుకొని అదికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. వాహనాల్లో డీజిల్ లేదని చెబుతూ ఎక్స్‌కవేటర్లను తరలించకుండా అడ్డుకున్నారు. మైనింగ్ అధికారులు వాటిని పెద్దపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి వాహనాలను సీజ్ చేసినట్లు మైనింగ్ ఆర్ఐ వెంకటగిరి తెలిపారు.

విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కరెంట్ స్తంభాలకు కట్టిన, కేబుల్, ఇంటర్నెట్ వైర్లను తొలగించాలని ట్రాన్స్‌కో ఏడీఈ డి.రాజ్ కుమార్, టౌన్ ఏఈ శ్రీనివాస్, టౌన్ 2 ఏఈ జగదీష్ కోరారు. గురువారం పలు ప్రాంతాలలో పర్యటించి కరెంటు స్తంభాలను పరిశీలించారు. ఇటీవల ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందిన సంఘటన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కేబుల్ ఇంటర్నెట్ సంస్థల నిర్వాహకులు, వైర్లను వెంటనే తొలగించాలని సూచించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా రోడ్డుకు అడ్డంగా ఉన్న ఇంటర్నెట్, కేబుల్ వైర్లను సరి చేయాలన్నారు, కరెంటు స్తంభాలకు కట్టిన బాక్సుల వల్ల సిబ్బందికి ఇబ్బంది కలుగుతున్నది వాటిని వెంటనే తొలగించాలని సూచించారు.

ముగ్గురు అధికారులకు పోస్టింగ్

కోల్‌సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌కు అదనపు కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, సెక్రటరీ పోస్టులు కేటాయించారు. అదనపు కమిషనర్‌గా గ్రేడ్-1 కమిషనర్ మారుతి ప్రసాద్‌కు పోస్టింగ్ ఇచ్చారు. ఈయన గతంలో మంచిర్యాల కమిషనర్‌గా పనిచేశారు. సెక్రటరీగా గ్రేడ్-2 కమిషనర్ ఉమా మహేశ్వర్ రావు, అసిస్టెంట్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లును నియమించారు.

హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టర్ పెద్ద కల్వలలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని విద్యార్థులు, సిబ్బంది వివరాలను తెలుసుకొని రిజిస్టర్‌లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ మార్గ దర్శకాల ప్రకారం కామన్ డైట్ మెనూ పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. పిల్లలకు అందిం చే ఆహార పదార్థాల నాణ్యతను రెగ్యులర్‌గా చెక్ చేసుకోవాలని అన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కూనారం, ఇదులాపూర్ గ్రామాల్లో మిస్సింగ్ సర్వే నెంబర్ పట్టా కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అనంతరం జాఫర్ ఖాన్‌పేట, ఇదులాపూర్ గ్రామాల్లోని అప్పర్ ప్రైమరీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు ఉండేలా చూడాలన్నారు. పిల్లలకు చదవడంతోపాటు అర్థం చేసుకునేలా గ్రహణశక్తి పెంపొందించాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లను పరిశీలించి పిల్లలు ఎంత మంది వస్తున్నారు, ఎలాంటి ఆహారం అందిస్తున్నారని టీచర్‌ను అడిగి తెలుసుకొని హాజరు రిజిష్టర్‌లను పరిశీలించారు. తహసీల్దార్ జగదీశ్వర్ రావు, డిప్యూటీ తహసీల్దార్ గర్రెపల్లి శంకర్, సర్వేయర్ రాజు పాల్గొన్నారు.



భూముల వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్

25 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో ఈనెల 25నుంచి ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పెద్దపల్లి మండల విద్యాధికారి సురేంద్రకుమార్ అన్నారు. గురువారం అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో మండల విద్యాధికారి సురేంద్రకుమార్ మాట్లాడారు. అండర్ - 14, 17 బాల బాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 25న బాలికలు కబడ్డీ, ఖో- ఖో, వాలీబాల్, 26న కబడ్డీ , ఖో ఖో, వాలీబాల్, 28న బాల బాలికలకు అథ్లెటిక్స్ పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉంటాయని తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని ఎంఈవో సూచించారు. మండల కన్వీనర్ శైలజ, పీఈటి సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల సురేందర్, శ్రీధర్, షఫీ, మంజు, భాస్కర్, కిసోర్, శేఖర్ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

మంథని, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేసి, తక్షణమే కాల్పుల విరమణ చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మల్లన్న కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని ఈనెల 24న వరంగల్‌లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని అంబేద్కర్ చౌక్‌లో గురువారం కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీలపై కొనసాగుతున్న హత్యాకాండను ప్రజాస్వామిక వాదులంతా ఖండించాలన్నారు. బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు తగరం శంకర్‌లాల్ మాట్లాడుతూ.. ఆదివాసీలను చంపే హక్కు ఎవరికి లేదని, రాజ్యాంగంలో పొందుపర్చిన ఆర్టికల్ 21 ద్వారా జీవించే హక్కును కాలరాయ వద్దన్నారు. బూడిద గణేష, గుమ్మడి కొమురయ్య, పోరెడ్డి వెంకన్న, గోగుల రాజిరెడ్డి, రాజబాబు, తిరుపతిలు పాల్గొన్నారు.

గణేష్ నవరాత్రులను శాంతియుతంగా జరుపుకోవాలి

ధర్మారం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం ధర్మారం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సీపీ, స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం రికార్డులను పరిశీలించారు. మండల వ్యాప్తంగా దాదాపు 150 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తారని ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గణేష్ మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ వైర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాజంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నా పోలీసులు న్యాయం వైపే ఉండాలన్నారు. ఇతర రాష్ట్రాల నుండి తెలంగాణకు డ్రగ్ సరఫరా అవుతున్నాయని, డ్రగ్స్ రవాణా చేసే వారితో పాటు వినియోగిస్తున్న వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడ సంఘటన జరిగినా గంటలోపే పోలీసులు చేరుకుంటారని తెలిపారు. డీసీపీ కరుణాకర్, ఏసీపీ జి.కృష్ణ, సీఐ కే.ప్రవీణ్ కుమార్, ధర్మారం ఎస్ఐ ఎం.ప్రవీణ్ కుమార్, బసంత్‌నగర్ ఎస్ఐ కె.స్వామి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ధర్మారం పోలీస్ స్టేషన్‌లో మొక్క నాటుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

ఎమ్మెల్యే అనాలోచిత నిర్ణయంతోనే కూల్చివేతలు



మాట్లాడుతున్న వ్యాళ్ళ హరీష్‌రెడ్డి

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ మోనార్క్‌లా వ్యవ హరిస్తున్నారని, అనాలోచిత నిర్ణయంతో గోదావరిఖనిలో ఇష్టారాజ్యంగా కూల్చివేతలకు పాల్పడుతున్నాడని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరిఖని ప్రధా నచౌరస్తాలో అక్రమ నిర్మాణాల పేరిట రెండు రోజుల నుంచి వ్యాపార సంస్థలకు సంబంధించిన భవనాలను కార్పొరేషన్ అధికారులు కూల్చి వేస్తున్న నేపథ్యంలో గురువారం పరిశీలించారు. ఆయన మాట్లా డుతూ ఎమ్మెల్యే అనాలోచిత నిర్ణయం వల్ల వేలాది మంది వ్యాపా రులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. ముందస్తు సమాచారం లేకుండా బిల్డింగ్‌లను నేలమట్టం చేస్తూ వ్యాపారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడన్నారు. అడ్డుపడితే పోలీసులతో భయపెట్టిస్తున్నారని, వ్యాపారులు సామగ్రిని తీసుకునే సమయం కూడా ఇవ్వడం లేద న్నారు. కోర్టులో ఉన్న కేసును కూడా లెక్క చేయ కుండా కూల్చివే యడం సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా పేరుతో పేదల ఇళ్ళను కూల్చుతుంటే ఎమ్మెల్యే ఇష్టారాజ్యంగా ఎలాంటి ప్రత్యా మ్నాయం చూపకుండా కూల్చివేస్తూ వ్యాపారుల పొట్టకొడు తున్నాడని విమర్శించారు.

ఓబీసీల పోరుబాట పుస్తక సమీక్ష



ఓబీసీల పోరుబాట పుస్తక సమీక్షలో పాల్గొన్న నాయకులు

ధర్మారం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యమం లేవనెత్తినప్పుడల్లా ఏదో ఒక అంశంతో ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం జరుగుతుందని కాకతీయ యునివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ చింతం ప్రవీణ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి రచించిన ఓబీసీల పోరుబాట పుస్తక సమీక్ష కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. స్వార్థ ప్రయోజనాల కోసం కొన్ని రాజకీయ పార్టీలు, ఉన్నత వర్గాలకు చెందిన నాయకులు బీసీలను విభజించి పాలిస్తున్నారన్నారు. బీసీలంతా రాజకీయ నాయకుల కుటిల ప్రయత్నాలను గమనిస్తూ బీసీల ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసిలా ప్రతీ ఒక్క బీసీ నడుం బిగించాలని కోరారు. జన అధికార సమితి ప్రధాన సభ్యుల తీట్ల రమేష్, మండల శాఖ అధ్యక్షుడు మామిడిశెట్టి శ్రీనివాస్, బొల్లం మల్లేశం, కొత్త నర్సింహులు, గంధం మల్లయ్య, తిరుపతి, ఒడ్నాల శంకరయ్య, ఆవుల మల్లయ్య, కట్ట రమేష్, మూల మల్లేశం, చొప్పరి చంద్రయ్య పాల్గొన్నారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

- గ్రామాల్లో పెరుగుతున్న జ్వర పీడితులు
- వాంతులు, విరోచనాలు, రక్తకణాల క్షీణత, ఒళ్ళు నొప్పులు
- ప్రభుత్వ ఆసుపత్రిలో పెరుగుతున్న రోగుల సంఖ్య

మంథని, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మంథని డివిజన్‌లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకోవడంతో జ్వర పీడితుల సంఖ్య పెరుగుతుంది. వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. వైద్యం కోసం మండల కేంద్రాలతోపాటు పల్లెల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. జ్వర పీడితులు, ఓపీలతో ఆసుపత్రులన్ని కిటకిటలాడుతున్నాయి. డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో కొద్ది రోజులుగా జ్వరాలు ప్రబలుతున్నాయి. మంథని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో రోజు రోజుకు ఓపీ సంఖ్య పెరుగుతూ వస్తుండగా ఇందులో అధికంగా జ్వర పీడితులే ఉంటున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలుపుతున్నాయి. తాజాగా ఓపీ సంఖ్య నిత్యం 3 వందలకు పైగా కొనసాగుతుందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణ ఓపీ, ల్యాబ్, వార్డుల్లో రోగుల రద్దీ కొనసాగుతుంది. చాలా మందికి టెస్టులు చేస్తుండగా మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలతో పాటు ప్లేట్‌లేట్స్ తగ్గుతున్నాయి. వర్షాలతో గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత లోపించి దోమలు, ఈగలు వ్యాప్తి చెందడంతోపాటు కలుషిత నీరు, శుభ్రంగా లేని ఆహారం తీసుకోవడం వల్ల ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ప్లేట్‌లెట్స్ క్షీణిస్తూ అస్వస్థతకు గురవుతూ ఒళ్ళు నొప్పులతో బాధ పడుతు న్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని రెండు వార్డులు జ్వర పీడితులతో నిండిపోయాయి. మంథని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగుల రద్దీ కొనసాగుతుంది. గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

వైరల్ ఫీవర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వాతావరణంలో చోటు చేసుకునే మార్పుల కారణంగా ప్రతీ ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలి.
- దోమలు కుట్టకుండా, ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా చూసుకోవాలి.
- దోమలు వృద్ధి కాకుండా మురుగునీరు, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి.
- పైపులైన్ ద్వారా వచ్చే తాగునీటిని నేరుగా సేవించకుండా వేడి చేసి చల్లార్చిన తరువాత తాగాలి.
- తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కీళ్ల, ఒళ్ళు నొప్పులు డెంగ్యూ వ్యాధి లక్షణాలు ఉన్న వారు నిర్లక్ష్యం చేయకుండా వైద్య సేవలు పొందాలి.
- చిన్న పిల్లలు, వృద్ధుల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దు.

ద్విచక్రవాహనం కల్వర్టును ఢీకొని ఒకరి మృతి


తోట మల్లారెడ్డి(ఫైల్)

ఎలిగేడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాములపల్లి గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తోట మల్లారెడ్డి(60) మృతి చెందాడు. రామడుగు మండలం వెంకట్రావుపల్లి నుంచి పెద్దపల్లి వైపు బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎస్ఆర్ఎస్‌పీ ఉప కాలువ ఎల్ పైన నిర్మించిన కల్వర్టును ఢీకొని మల్లారెడ్డి కాలువలో పడ్డాడు. దీంతో అతని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అటువైపు వెలుతున్న వారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మృతుడి కుమారుడు రిషికేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

కోతుల దాడిలో ఉపాధ్యాయుడికి గాయాలు

హుజూరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై కోతులు దాడి చేశాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న విద్యార్థులపై కోతులు దాడి చేయడానికి ప్రయత్నించాయి. గమనించిన ఉపాధ్యాయుడు సంపత్‌కుమార్ కర్రతో కోతులను అడ్డుకునేందుకు వెళ్లగా ఒక్కసారిగా ఆయనపై దాడి చేశాయి. దీంతో సంపత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో ఇద్దరికి గాయాలు

- ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

తంగళ్లపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆటో నిర్లక్ష్యంగా నడిపి ఇద్దరిని గాయపర్చిన ఆటో డ్రైవర్ నెల్లుట్ల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు. బుధవారం రాత్రి తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన అక్కెనపల్లి నాగరాజు నడుచుకుంటూ వెళ్తుండగా బద్దనపల్లి శివారులో ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో నాగరాజుతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న నాగరాజు గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడ్డ వారు ఆటోడ్రైవర్‌పై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని బొంపల్లి గ్రామం నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను కోర్టులో హాజరు పరుచగా గురువారం వారికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి జరిమానా విధిస్తూ పెద్దపల్లి కోర్టు జడ్జి సునిత తీర్పు ఇచ్చినట్లు రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు. జూలై 2020లో ఇద్దరు వ్యక్తులు నిజామాబాద్‌లోని గుర్తు తెలియని వ్యక్తి నుంచి 2 కిలోల గంజాయిని రూ.10 వేలకు కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ప్యాకెట్‌ను రూ. 150 నుంచి 200 వరకు బొంపల్లిలో విక్రయిండగా అప్పటి బసంత్‌నగర్ ఎస్ఐ జానీపాష వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇరువురిపై నేరం రుజువు కావడంతో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష, 5 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. నేరస్తులకు శిక్షపడేలా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాదం రమేష్, పోలీసు అధికారులు కీలక పాత్ర పోషించారు.


కరీంనగర్‌లో మండపానికి తరలుతున్న గణనాథుడు


విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహం

ఉత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకుందాం

వినాయకుల విగ్రహాల తరలింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గణేశ్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రులు వచ్చాయంటే అందరిలో ఉత్సాహం నెలకొంటుంది. రోజురోజుకు విగ్రహాల పరిమాణం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో విగ్రహాల తరలింపులో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని సంద ర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ యేడు విగ్రహాలు విద్యుత్ తీగలకు తగిలి పలువురు ప్రాణాలు కోల్పోయారు. మరి కొందరు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి విద్యుత్ శాఖ సిబ్బందికి, మండపాల నిర్వా హకులకు పలు సూచనలు చేశారు.

- విగ్రహాల ఎత్తుని బట్టి రూట్‌ని నిర్ణయించుకోవాలి. ఎక్కడైనా సమస్యలు ఉంటే విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి
- విద్యుత్ లైన్లకు కనీసం రెండు అడుగుల దూరం పాటించాలి. లైన్ లో ప్రవహించే విద్యుత్ సరఫరా ప్రభావం, ఇండక్షన్ రెండు అడుగుల వరకు ఉంటుంది .
- ఎత్తైన విగ్రహాల తరలింపులో మరింత అప్రమత్తంగా ఉండాలి
- మెటల్ ఫ్రేమ్‌లతో కూడిన డెకొరేషన్లను వీలైనంత వరకు తగ్గించాలి.
- మండపాలకు విద్యుత్ సరఫరా కనెక్షన్ కోసం సామాన్యులు స్తంభాలు ఎక్కవద్దు. విద్యుత్ సిబ్బంది ద్వారానే కనెక్షన్ పొందాలి.
- ఐఎస్ఐ మార్క్ కలిగిన ప్రామాణిక విద్యుత్ వైర్లను మాత్రమే వాడాలి. ఎలాంటి జాయింట్ వైర్లు వాడరాదు. తగినంత కెపాసిటీ కలిగిన ఎంసీబీ తప్పని సరిగా వాడాలి. ఇది విద్యుత్ ప్రమాదాల నుండి రక్షణ ఇస్తుంది.
- మండపాల్లో విద్యుత్ సంబంధిత పనులు చేసేటప్పుడు పరిసరాలను క్షుణ్ణంగా పరి శీలించాలి. విద్యుత్ వైర్లు, పోల్స్, ఇతర ప్రమాదకర విద్యుత్ పరికరాల నుండి పిల్లల్ని దూరంగా ఉంచాలి.
- ఎవరికైనా విద్యుదాఘాతం తగిలితే వారికి వెంటనే వైద్య సహాయం అందించి, ఆ ప్రమాదం గురించి దగ్గరలోని విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి.
- వైరింగ్‌లో ఎక్కడైనా లీకేజీ ఉంటే, వర్షాలు కురిసినప్పుడు తేమ వలన విద్యుదాఘాతం తగిలే అవకాశమున్నది. మండపాల నిర్వాహకులు ప్రతి రోజు తప్పని సరిగా వైరింగ్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఆర్టీసీ బస్సు కిందపడి ఇద్దరు విద్యార్థులకు గాయాలు


గాయపడ్డ అభిషేక్

మానకొండూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు కింద పడి ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని చెంజర్లకు చెందిన అశ్విక్‌తేజ, అభిషేక్ పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో చదువుతున్నారు. గురువారం పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు సాయంత్రం ఇంటికి వచ్చే క్రమంలో పోచంపల్లి పాఠశాల వద్ద ఆదర్శ పాఠశాలకు కేటాయించిన బస్సులో ఎక్కుతుండగా అశ్విక్‌తేజ, అభిషేక్‌లు బస్సు వెనుక టైర్ కిందపడి తీవ్రంగా గాయపడ్డట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. 108కు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు సూచించడంతో హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై క్రాంతికుమార్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తికి చెందిన అమ్మిగల అనిల్ సెల్‌ఫోన్ 2023 మార్చి 3న బొమ్మకల్ గ్రామంలో పోగొట్టుకున్నాడు. ఈ మేరకు బాధితుడు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ లోకేషన్‌ను గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. బాధితుడు అనిల్‌కు గురువారం కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్‌ను అప్పగించారు.

ఇల్లందకుంట : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు బాధితుడికి అప్పగించారు. ఇల్లందకుంట మండలానికి చెందిన జక్కుల దేవేందర్ ఇటీవల తన మొబైల్‌ను పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను ట్రేస్ చేసి ఎస్ఐ క్రాంతి కుమార్ బాధితుడికి తిరిగి అందజేశారు. ఈ మేరకు బాధితుడు దేవేందర్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరుగురి బైండోవర్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడిన ముగ్గురితోపాటు అనుమానాస్పదంగా తిరుగుతున్న మరో ముగ్గురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఇసుక అక్రమ రవాణా కేసులో నిందితులుగా ఉన్న గొల్లపల్లికి చెందిన కె.ఆంజనేయులు, కె.తిరుపతి, డి.సంపత్‌ను, బొమ్మకల్‌లో బుధవారం రాత్రి అనుమానాస్పదంగా తిరిగిన కరీంనగర్ కోతిరాంపూర్‌కు చెందిన రమేష్, ఏసు, నాగరాజును గురువారం తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

ట్రేడింగ్ పేరుతో రూ.74 లక్షల మోసం

- ముగ్గురు సైబర్ నేరస్థుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలకు పాల్పడుతున్న కర్ణాటకకు నాగేంద్ర ప్రసాద్, యోగేష్ కదం, సునీల్ అనే ముగ్గురు నేరస్థులను గురువారం సైబర్ క్రైం, జగిత్యాల జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ గురువారం వివరాలను వెల్లడించారు. సైబర్ నేరస్థుల మాటలు నమ్మి జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల పట్టణాలకు చెందిన ఇద్దరు బాధితులు బిజినెస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ పేరుతో ఆన్‌లైన్‌లో విడతల వారీగా రూ.74 లక్షలు పెట్టి మోసపోయారు. అనంతరం బాధితులు జగిత్యాల సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు.

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా సైబర్ క్రైం డీఎస్పీ వెంకటరమణ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని నియమించారు. దీంతో కోరుట్ల సీఐ సురేష్, బుగ్గారం ఎస్సై సతీష్, సైబర్ క్రైం ఎస్సైలు కృష్ణ, దినేష్ కుమార్‌లు స్పెషల్ ఆపరేషన్ చేపట్టారు. సైబర్ మోసానికి పాల్పడిన నిందితులకు చెందిన బ్యాంక్ ఖాతాలను గుర్తించారు. నిందితులు కర్ణాటక రాష్ట్రం బెంగళూర్‌లోని శ్రీనివాసపురంకు చెందిన నాగేంద్రప్రసాద్, ఉత్తర బెంగళూర్‌లోని దశరథాళికి చెందిన యోగేష్ కదం, నార్త్ బెంగళూర్‌లోని హెన్నూర్ క్రాస్‌కు చెందిన సునీల్‌లుగా గుర్తించారు. నిందితులు బెంగళూరులో ఉన్నట్లు గుర్తించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాంకు ఖాతాలతో పాటు స్టాక్ మార్కెట్, బిజినెస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ పేరుతో జరుగుతున్న మోసాలను గుర్తించారు. ముగ్గురు నిందితులు కలకత్తాలో ఓ ముఠా ద్వారా ట్రాన్‌జాక్షన్ చేస్తున్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేశారు. ఇందులో నాగేంద్ర ప్రసాద్ సులువైన మార్గాల ద్వారా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో కలకత్తాలోని గ్యాంగ్ సభ్యులతో కలిసి ట్రేడింగ్ పేరుతో ఆన్‌లైన్ లావాదేవీలు చేయించి ప్రజలను మోసగించి వచ్చిన డబ్బులను ఇతర ఖాతాలకు బదిలీ చేస్తున్నట్లు గుర్తించారు. సైబర్ నేరస్థుడు నాగేంద్ర ప్రసాద్‌పై దేశ వ్యాప్తంగా 71 కేసులు నమోదైనట్లు గుర్తించారు. మొబైల్‌తో పాటు బ్యాంక్ ఖాతాల పుస్తకాలు, చెక్ బుక్కులను జగిత్యాల జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే యోగేష్ కదం, సునీల్‌లు ఇతరుల పేర్లతో బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేసి సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తూ వచ్చిన డబ్బులను జల్సాలకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. దేశ వ్యాప్తంగా యోగేష్ కదం, సునీల్‌పై 22 కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు.

వీధి కుక్కలను చంపుతున్నారని పోలీసులకు ఫిర్యాదు

కోల్‌సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తులు వీధి కుక్కలను చంపుతున్నారంటూ స్ట్రే ఎనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అనే ఎన్‌జీఓ ప్రతినిధి ముదావత్ ప్రీతి బుధవారం రాత్రి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దుర్గానగర్ వద్ద కొందరు వ్యక్తులు కుక్కలను ఒక వ్యాన్‌లో తరలిస్తున్నారని, అందులో రెండు కుక్కలు చనిపోయాయని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను ఓ మాజీ కార్పొరేటర్ అడ్డుకున్నాడని ఫిర్యాదులో తెలిపారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వేములవాడలో శిథిలాల తొలగింపు

- వేగవంతంగా రోడ్డు విస్తరణ పనులు


వేములవాడలో శిథిలాలను తొలగిస్తున్న యంత్రాలు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే ప్రధాన రహదారి విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ. 47 కోట్లతో మూలవాగు బ్రిడ్జి నుంచి రాజన్న ఆలయం వరకు గత రోడ్డును 80 ఫీట్లకు విస్తరిస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డుకు ఇరువైపుల 254 ఇండ్లను తొలగించేందుకు నిర్ణయించి నిర్వాసితులకు పరిహారం అందజేశారు. దీంతో గత రెండు నెలలుగా భవనాలను కూల్చివేసిన శిథిలాలు, మట్టి తొలగించకపోవడంతో ఆలయానికి వచ్చే భక్తులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనుల శిథిలాలను తొలగించేందుకు రూ. 22 లక్షలు నిధులు మంజూరు చేసింది. అయితే కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను వేగవంతంగా చేపడుతున్నాడు. శిథిలాలు, మట్టిని వేగంగా తరలిస్తూ విస్తరణ పనులు చకచక నడుస్తున్నాయని పట్టణ వాసులు చెబుతున్నారు. వ్యర్థాల తొలగింపుతో రోడ్డు వెడల్పు కనిపించడంతో భక్తులు, పట్టణ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మానేరు వద్ద జన సందడి


మానేరు వద్ద అహ్లాదంగా గడుపుతున్న జనం

గంభీరావుపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయం వద్ద జనసందడితో కిటకిటలాడుతోంది. మానేరు ప్రాజెక్టు మత్తడి దూకుతుడటంతో సందర్శకులు వస్తున్నారు. ప్రాజెక్టు పరవళ్లను తిలకించేందుకు మానేరు పరిసరాలకు పర్యాటకులు ఉత్సహంగా విచ్చేస్తున్నారు. దీంతో మానేరు ప్రాంతం సందర్శకులతో సందడిగా మారింది.

నీటిసంపులో పడిన ఆవు

- రక్షించిన ఫైర్ సిబ్బంది


సంపులో పడిన ఆవు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని దోబివాడలో బుధవారం రాత్రి ఓ ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో ఆవు ప్రమాదవ శాత్తు పడిపోయింది. గమనించిన స్థానికులు ఆవును రక్షించేందుకు ప్రయత్నించారు. సాధ్యంకాక పోవడంతో వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బందితో పాటు ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ఆవును రక్షించారు.

కారులో వచ్చి నగదు చోరీ

- బైక్ నుంచి రూ.1.9 లక్షలు దొంగిలించిన మహిళలు



సీసీ కెమెరాలో అనుమానాస్పదంగా కనిపించిన మహిళలు

జమ్మికుంట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు కారులో వచ్చిన ఇద్దరు మహిళలు కళ్లు మూసి తెరిచే లోపు ఓ ద్విచక్ర వాహనం నుంచి నగదు కాజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన పొద్దుటూరి శ్యామ్‌రెడ్డి తన భార్యతో పాటు ద్విచక్ర వాహనంపై జమ్మికుంట పట్టణానికి వచ్చాడు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 1.9 లక్షల రూపాయలు విత్ డ్రా చేసుకుని తన ద్విచక్ర వాహనం ముందు బ్యాగులో పెట్టుకున్నాడు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లి తన భార్యను ఇంటికి వెళ్లేందుకు బస్సు ఎక్కించాడు. అనంతరం పాత వ్యవసాయ మార్కెట్ దగ్గర ఉన్న నందిని కిరాణం ఎదుట ద్విచక్ర వాహనం పెట్టి లోనికి వెళ్లాడు. ఆ షాపులో కావల్సిన సామగ్రి లేక పోవడంతో పక్క షాపులోకి లోకి వెళ్లాడు. అందులో కావాల్సిన సామాగ్రి తీసుకున్నాడు.

అప్పటికే నంబర్ ప్లేట్ లేని ఓ కారులో ఇద్దరు మహిళలు అతడిని అనుసరిస్తున్నారు. అదును చూసి ద్విచక్ర వాహనం ముందు బ్యాగులో ఉన్న నగదును తీసుకోని ఏం తెలియనట్లు అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్లి కారు వెనుకాల సీట్లలో కూర్చున్నారు. అప్పటికే స్టార్ట్ చేసి ఉన్న కారులో పరారయ్యారు. ఇదంతా తెలియని బాధితుడు తన ద్విచక్ర వాహనం వద్దకు వెళ్లి ముందు బ్యాగును పరిశీలించగా ఖాళీగా కనిపించింది. దీంతో కంగుతిన్న అతడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు.

చోరీ ఘటన సీసీ కెమెరాలో నమోదైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

గాయపడిన వ్యక్తిని కాపాడిన ట్రాఫిక్ ఎస్సై


గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న ఎస్ఐ హరిశేఖర్

కోల్‌సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మున్సిపల్ జంక్షన్‌లో గురువారం పెద్దపల్లి నుంచి మంచిర్యాల వైపునకు వెళుతున్న రన్నింగ్ ఆటో నుంచి ఒక వ్యక్తి జారి కిందపడ్డాడు. అతనికి తీవ్ర గాయాలై ప్రాణాపాయ స్థితిలో ఉండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ హరిశేఖర్ అతన్ని హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటోను వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. మానవతా దృక్పథంతో క్షతగాత్రుడిని ఆసుపత్రిలో చేర్పించి ప్రాణాలు కాపాడిన ఎస్ఐ హరి శేఖర్‌ను ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ రాజేశ్వర్‌రావు అభినందించారు.

బీర్‌పూర్ పెద్దగుట్టపై వరదపాశం

- పెద్దగుట్టలో లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు


బీర్‌పూర్ పెద్ద గుట్టపై వరద పాశం పోస్తున్న అర్చకులు

బీర్‌పూర్,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):బీర్‌పూర్ మండలకేంద్రం శివారులోని శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ సమీపంలోని పెద్దగుట్టపై వెలసిన స్వామి వారికి గురువారం వరదపాసం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్దగుట్టపై వెలిసిన శ్రీ లక్ష్మీనర్సింహ స్వామికి ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో స్వామి వారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా ఆదివారం బీర్‌పూర్ గ్రామంలోని నాయకులు, రైతులు, అర్చకులు, ఆయా గ్రామాల ప్రజలు గ్రామ శివారులోని పెద్దగుట్ట వద్దకు కాలినడకన చేరుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్దగుట్ట ఆలయ చరిత్రను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా వరద పాసం నిర్వహనకు, అన్నదానం కార్యక్రమాలకు పలువురు దాతలు తమ వంతుగా ఆర్థిక సహాయ హకారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పండితులు పెద్ద సంతోష్ కుమార్, మధు కుమార్, చిన్న సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని షిరిడీలో ఈ నెల 22 నుంచి 25 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు కరీంనగర్ జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి శ్రీపాల్‌రెడ్డి, కొరిమి సంతోష్‌కుమార్, పెద్దపల్లి జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆలేటి సంపత్ తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 15 సంవత్సరాల విభాగంలో ఆర్ .విష్ణువర్ధన్, ఎ.లక్షిత్ రాజ్, బి.హర్షవర్ధన్, 17 సంవత్సరాల విభాగంలో కె.అరవింద్, ఈ.శ్రీధర్, టి.రిత్విక్, టి.అవినాష్, జి.సుజిత్ కుమార్, పెద్దపల్లి జిల్లా నుంచి 15 సంవ త్సరాలు విభాగంలో ఇ.అవినాష్ రావు, అండర్-17 విభాగంలో విశ్వనాథ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా డీవైఎస్‌వో శ్రీనివాస్, ఒలంపిక్ అసోసియేషన్ బాధ్యులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, మహ్మద్ కరీం, ప్రైవేట్ పీఈటీ బాధ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, గౌతమ్ హర్షం వ్యక్తం చేశారు.


ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ..

కోనరావుపేట: జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు మండల విద్యార్థి ఎంపికైనట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్ తెలిపారు. కోనరావుపేట మండలం మట్టిమల్ల గ్రామానికి చెందిన లకావత్ ఆరాధ్య ఎస్ఏటిజి అకాడమీ విద్యార్థి ఈ నెల 18, 19 తేదీల్లో రాష్ట్రస్థాయి అండర్ 15 క్రీడల్లో ప్రతిభ కనపరచగా జాతీయస్థాయి క్రీడకి ఎంపికైనట్టు తెలిపారు. పూణేలో ఈ నెల 25న జరగనున్న వాలీబాల్ క్రీడలకు ఎంపికైనట్టు తెలిపారు.


ఆరాధ్య


సాయిచరణ్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి గంగు సాయిచరణ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాలలో పదవతరగతి చదువుతున్న సాయిచరణ్ సిరిసిల్లలో గురువారం జరిగిన పోటీలలో లాంగ్ జంప్ విభాగంలో ఉత్తమ ప్రదర్శన కనబర్చి ఎంపికయ్యాడు. ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నాడు.

రాజన్న ఆలయంలో వృద్ధుడి అస్వస్థత

● ఆసుపత్రికి తరలించిన ఆలయ ఉద్యోగులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఓ భక్తుడు అస్వస్థతకు గురయ్యాడు. రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో వస్తున్న వృద్ధుడు హఠాత్తుగా ఒక్కసారిగా అస్వస్థతకు గరయ్యాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు, ఆలయ ఉద్యోగులు అంబులెన్స్ సహాయంతో ఆసుపత్రికి తరలించారు.



వృద్ధుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఆలయ ఉద్యోగులు

ముస్లిం మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

● అర్హులకు అందడం లేదని పలువురి ఆందోళన

తంగళ్లపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ ముస్లిం మహిళలకు ప్రభుత్వం కుట్టు మిషన్లు పంపిణీ కోసం గతంలో దరఖాస్తులు స్వీకరించగా గురువారం మైనార్టీ శాఖ అధికారులు అర్హులైన మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలో మైనార్టీ పాఠశాల అవరణలో పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తుండగా అర్హులైన తమకు ఎందుకు ఇవ్వడం లేదని కొంత మంది మహిళలు అధికారులను నిలదీశారు. ఏడాది క్రితం దరఖాస్తులు చేసుకున్నామన్నారు. మిషన్ తీసుకోవడానికి రావాలని మైనార్టీ కార్యలయం నుంచి ఫోన్ ద్వారా సమాచారం అందించారని తెలిపారు. పంపిణీ కేంద్రం దగ్గరికి వస్తే అర్హుల జాబితాలో పేరు లేదని చెప్తున్నారన్నారు. అర్హుల జాబితాలో పేరు లేకుంటే మమ్మల్ని ఎందుకు రమ్మన్నారని అధికారుల తీరుపై మహిళలు మండి పడ్డారు. అర్హులైన తమకు కూడా కుట్టు మిషన్లు అందించాలని డిమాండ్ చేశారు. విషమయంపై వివరణ కోసం మైనార్టీ అధికారులను ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా స్పందించలేదు.



యశస్వీ భవ

ఓబీసీ, ఈబీసీ విద్యార్థులకు పీఎం యశస్వీ స్కాలర్‌షిప్‌లు



● ఉన్నత విద్య కోసం రూ. రెండు లక్షల వరకు ఉపకార వేతనం

● దరఖాస్తుకు ఈ నెల 27 వరకు గడువు

చొప్పదండి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ, ఈబీసీ, సంచార జాతుల విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం యశస్వీ పథకాన్ని తీసుకువచ్చింది. ఉన్నత విద్య అభ్యసించలేని ఓబీసీ, ఈబీసీ, సంచార జాతుల విద్యార్థులకు పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ అందించి వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వశాఖ ద్వారా ఈ స్కాలర్‌షిప్‌లను అందజేయనుంది. స్వయం ప్రతిపత్తి, ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం రెండు లక్షల వరకు స్కాలర్‌షిప్‌లు లభించనున్నాయి. హాస్టల్ వసతి ఖర్చుల కోసం ప్రతి నెల మూడు వేల రూపాయల వరకు చెల్లించనున్నారు. 2025-26 విద్యాసంవత్సరానికిగాను పీఎం యశస్వీ పథకం కింద విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



● దరఖాస్తు ప్రక్రియ ఇలా...

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులు ఎన్‌ఎస్‌పీ (నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్), ఎన్‌టీఏ, scholarships.gov.in పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ఆధార్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత పత్రాలు, బ్యాంకు ఖాతా వివరాలను అప్‌లోడ్ చేయాలి. తర్వాత విద్యార్థికి ఒక ఐడీని కేటాయిస్తారు. ఆ ఐడీ ద్వారా ఎప్పటికప్పుడు విద్యార్థి స్కాలర్‌షిప్ స్టేటస్‌ను చెక్ చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 27 చివరి తేదీకాగా, చేసుకున్న దరఖాస్తుల్లో లోపాలను సవరించుకునేందుకు సెప్టెంబరు 15 వరకు అవకాశం కల్పించారు.

● నవంబరు వరకు స్కాలర్‌షిప్‌లు మంజూరు

పీఎం యశస్వీ(పీఎం యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు స్కీం ఫర్ వైబ్రెంట్ ఇండియా) పథకం కింద టాప్‌క్లాస్ విద్యాసంస్థల ఫీజులు, హాస్టల్ ఫీజులను విద్యార్థులకు అందజేస్తారు. ఎన్‌ఐటీ, ఐఐటీ, నిఫ్ట్, ఐఐఐటీ, ఇష్లాతోపాటు ఇతర టాప్‌క్లాస్ విద్యాసంస్థలలో చేరే విద్యార్థులకు గరిష్ఠంగా రెండు లక్షల వరకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తారు. విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రెండు లక్షలలోపు ఉండాల్సి ఉంది. ఈ పథకం కింద రాష్ట్రంలోని పలు విద్యాసంస్థలకు 400కుపైగా స్లాట్‌లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. స్లాట్లు, దరఖాస్తుల ఆధారంగా నవంబర్ వరకు స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయనున్నారు. దీనికి ఎలాంటి అర్హత పరీక్ష లేదు. స్కాలర్‌షిప్‌లలో 30 శాతం బాలికలకు కేటాయిస్తారు.

వైభవంగా సామూహిక లక్ష బిల్వార్చన



పూజా కార్యక్రమంలో భక్తులు

ఓదెల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో గురువారం అర్చకులు వీరభద్రయ్య ఆధ్వర్యంలో సామూహిక లక్ష బిల్వార్చన వైభవంగా నిర్వహించారు. యేటా నిర్వహించే మాదిరిగా లోక సంరక్షణార్థమై 180మంది దంపతులతో లక్ష బిల్వార్చన నిర్వహించారు. శ్రావణమాసం విశిష్టత, బిల్వార్చన ప్రాధాన్యతను ఈ సందర్భంగా అర్చకుడు భక్తులకు వివరించారు. బిల్వార్చనతోపాటు ఏకాదశ రుద్రాభిషేకం, సహిత రుద్రాహావణం, మంగళహారతి మంత్రపుష్పం నిర్వహించారు. గర్భగుడిలో కొలువుదీరిన శేషాలింగేశ్వరునికి భక్తులు బిల్వపత్రిని సమర్పించారు. గోదావరిఖనికి చెందిన కన్నూరి రాజమల్లు,సుగుణ దంపతులు అన్నదానం నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి సదయ్య, జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణంపై డీఎల్పీవో విచారణ

శంకరపట్నం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని కరీంపేట గ్రామంలో ఇంటి నిర్మాణంపై హుజూరాబాద్ డీఎల్పీవో శ్రీనివాస్ గురువారం విచారణ చేపట్టారు. కరీంపేట గ్రామపంచాయతీ కార్యాలయం వెనుక భాగంలో వనపర్తి అయిలయ్య అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తుండగా గ్రామపంచాయతీ స్థలం ఆక్రమించాడని వనపర్తి హరీష్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హుజూరాబాద్ డీఎల్పీవో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుదారుడు హరీష్‌తో పాటు గృహ నిర్మాణం చేపడుతున్న వనపర్తి అయిలయ్య వాంగ్మూలాలు తీసుకున్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని డీఎల్పీవో శ్రీనివాస్ తెలిపారు. ఆయన వెంట ఎంపీవో ప్రభాకర్ ఉన్నారు.

24న జనహిత పాదయాత్ర

- ఉప్పరమల్యాల నుంచి గంగాధర వరకు..
- 25న ప్రభుత్వ పాఠశాలలో శ్రమదానం,
- మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలోని ఉప్పరమల్యాల గ్రామం నుంచి కురిక్యాల చౌరస్తా మీదుగా గంగాధర వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జనహిత పాదయాత్ర ఈనెల 24న నిర్వహిస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం డీసీసీ కార్యాలయంలో మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాదయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు, అనుబంధ సంఘాలకు, పార్టీ అభిమానులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. యాత్రను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమన్వయ పరుస్తారన్నారు. 24వ తేది సాయంత్రం పాదయాత్ర తరువాత గంగాధరలో బస ఉంటుందన్నారు. 25వ తేది ఉదయం ప్రభుత్వ పాఠశాలలో శ్రమదానం, మొక్కలు నాటే కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మీనాక్షి నటరాజన్ పాల్గొంటారని తెలిపారు. మహిళా సంఘాలతో మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ ఇంటరాక్షన్ ఉంటుందన్నారు. అనంతరం జిల్లా ముఖ్య కార్యకర్తలతో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మీనాక్షి నటరాజన్ ఇష్టాగోష్టి నిర్వహిస్తారని మంత్రి తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్న ప్రభాకర్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, మక్కాన్ సింగ్

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ 24న సాయంత్రం 4 గంటలకు గంగాధర మం డలంలో జనహిత పాదయాత్ర ఉంటుం దన్నారు. ఈ పాదయాత్రలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తలు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముఖ్య నేతలంతా పాల్గొంటారన్నారు.

● ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు భరోసా ఇస్తూ పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్‌పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుని సంక్షేమాన్ని అమలు చేస్తుందన్నారు. విద్యార్థులు, యువకులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. సమావేశంలో ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్‌రావు, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఆకారపు భాస్కర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, ఆకుల నర్సన్న, రాజిరెడ్డి, పులి అంజనేయులు, శ్రావణ్‌రాయక్, దన్నా సింగ్, బోనాల శ్రీనివాస్, పొన్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కవ్వంపల్లికి మంత్రి పొన్నం పరామర్శ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు కవ్వంపల్లి రాజేశం బుధవారం అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం కరీంనగర్‌లో పరామర్శించారు. కవ్వంపల్లి రాజేశం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కవ్వంపల్లి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రజాసంఘాల జాతీయ నాయకుడు పొలాడి రామారావు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఉన్నారు.



ఎమ్మెల్యే కవ్వంపల్లితో మంత్రి పొన్నం ప్రభాకర్

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

● మాస శివరాత్రి సందర్భంగా మహాలింగార్చన



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శ్రావణ మాసం రద్దీ కొనసాగుతోంది. గురువారం ఉదయం ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీపార్వతిరాజరాజేశ్వర స్వామి వారలను దర్శించుకున్నారు. శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకొని పరివారం దేవతాలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు.

మాస శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు

శ్రీరాజరాజేశ్వర స్వామివారికి మాస శివరాత్రి సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయం 5.30గంటల నుంచి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపించారు. స్వామివారికి కల్యాణ మండపంలో రుద్రహవనం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం 6.05 గంటలకు అద్దాల మండపంలో మహాలింగార్చన నిర్వహించగా, ఆలయ ఈవో రాధాబాయితో పాటు భక్తులు హాజరై లింగాకృతిలో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

కులధ్రువీకరణ పత్రంలో నో కరెక్షన్

● ఆప్షన్ లేకపోవడంతో అయోమయం

ధర్మారం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కుల ధ్రువీకరణ పత్రంలో కరెక్షన్ ఆప్షన్ లేకపోవడంతో బాధితులు అయోమయానికి గురవుతున్నారు. గతంలో మీ సేవలో కమ్యూనిటీ అండ్ డేట్ ఆఫ్ బర్త్ పేరుతో కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చేవారు. క్యాస్ట్ సర్టిఫికెట్‌లో కులంతోపాటు పుట్టిన తేదీ వివరాలు ఉన్నా రెవెన్యూ అధికారులు కేవలం కులం సర్టిఫికెట్‌ను మాత్రమే మంజూరు చేసేవారు. దాదాపు నెల రోజుల క్రితం కుల ధ్రువీకరణ పత్రం విషయంలో డేట్ ఆఫ్ బర్త్ ఆప్షన్ తీసివేసి కేవలం కమ్యూనిటీ సర్టిఫికెట్ అని వచ్చేలా ప్రభుత్వం అప్‌డేట్ చేసింది. ఈ అప్‌డేట్ విద్యార్థులకు శాపంగా మారింది.

ఉదాహరణకు ఒక వ్యక్తి కులం సర్టిఫికెట్ కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకోగా అతను ఇంతకు ముందు ఎన్ని సార్లు కుల ధ్రువీకరణ పత్రం తీసుకున్నారో దానికి సంబంధించిన పూర్తి వివరాలు చూపిస్తుంది. అందులో నుంచి చివరగా తీసుకున్న సర్టిఫికెట్‌ను మాత్రమే అతను రీ ప్రింట్ తీసుకోవచ్చు కాని కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి వీలులేదు. ఇంతకు ముందు కుల ధ్రువీకరణ కోసం దరఖాస్తు చేసుకోని వారు అప్లై చేసుకుంటే దరఖాస్తు తీసుకునేలా వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేశారు.

కొందరికి మేలు..

గతంలో దరఖాస్తు చేసుకున్న వారు తరచూ ఆఫీసు చుట్టూ తిరగకుండా వచ్చిన పాత డేటానుంచే సులభంగా కుల ధ్రువీకరణ పత్రం పొందుతున్నారు. అయితే గతంలో జారీచేసిన కులం సర్టిఫికెట్స్‌లో తప్పులు దొర్లినవారికి కరెక్షన్ ఆప్షన్ లేకపోవడంతో నానాతంటాలు పడుతున్నారు. ఇలాంటివారికి కొత్తగా దరఖాస్తుకు, కరెక్షన్‌కు అవకాశంలేక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వివిధ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు, కాలేజీ స్టూడెంట్స్, స్కాలర్‌షిప్‌కోసం అవసరమున్న వారు, కల్యాణలక్ష్మి దరఖాస్తు చేసుకునేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు కమ్యూనిటీ సర్టిఫికెట్‌కు కరెక్షన్‌ఆప్షన్ కల్పించాలని కోరుతున్నారు.



కుల సర్టిఫికెట్‌లో తప్పు సరిదిద్దాలని కోరుతున్న బాధితుడు

ఏం చేయాలో అర్థం కావడం లేదు..

- నునావత్ అరుణ్ నాయక్, (లంబడితండా బి గ్రామం)

నా పేరు నునావత్ అరుణ్ నాయక్, మాది లంబడితండా బి గ్రామం. నేను ఆర్మీకి సెలెక్ట్ అయ్యాను. నాకు వచ్చే నెలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంది. ఇంతకు ముందు తీసిన కులం సర్టిఫికెట్‌లో నాపేరు అరుణ్ నాయక్‌కు బదులు అరుణ్ అని పడింది. కొత్తగా కులం సర్టిఫికెట్‌కు మీ సేవకు వెలితే పాత సర్టిఫికెట్ వస్తుంది. పాత సర్టిఫికెట్‌ను కరెక్షన్ ఆప్షన్ లేదు అంటున్నారు. దీంతో ఏం చేయాలో నాకు అర్థం కావడం లేదు. సంబంధిత అధికారులే నాకు న్యాయం చేయాలి.

ప్రాజెక్టుల్లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ఎస్సారెస్పీలోకి 1,39,255 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 75.709 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 49.435 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలు వలు, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 29,532 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 20,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 6,500 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 651 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు మూడు, నాలుగు రోజులుగా భారీగా వరద వస్తుండడంతో గేట్లు ఎత్తి దిగువ గోదావరికి నీటిని విడుదల చేశారు. వరద తగ్గుముఖం పట్టడంతో ఈనెల న ఉదయం 6 గంటల నుంచి గేట్లు మూసి వేశారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

● ఎల్లంపల్లికి పోటెత్తుతున్న వరద

అంతర్గాం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కడెం ప్రాజెక్టు నుంచి 3,600 క్యూసెక్కులు, శ్రీరాంసాగర్ నుంచి 26,000, వాగులు, వంకల నుంచి 47500 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉన్నందున గురువారం ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులు 15 గేట్లు ఎత్తి లక్ష 16వేల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 19.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది..

● మంథనిరూరల్: మండలంలోని సిరిపురం సమీపంలోని సుందిళ్ల బ్యారేజీలో వరదగురువారం సాయంత్రం వరకు తగ్గుముఖం పట్టింది. బ్యారేజీ నుంచి 26 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నారు.

● గాయత్రి నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

రామడుగు: రామడుగు మండలం గాయత్రి లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం ఒక పంపు ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని అధికారులు గ్రావిటీ కెనాల్‌కు విడుదల చేస్తున్నారు.

● బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి నీటితో పాటు, మూలవాగు, మానేరు ద్వారా నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి గురువారం సాయంత్రం వరకు 18,060 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. వరద కాలువ ద్వారా 14,800, గాయత్రి పంప్‌హౌస్ నుంచి 3,150, మూలవాగు, మానేరు వాగు ద్వారా 110 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 312.17 ఉంది. నీటి నిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 15.97 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉండగా, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

● అన్నపూర్ణకు కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట: మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.1 టీఎంసీల నీరు ఉంది. ఎగువన ఉన్న సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్ ప్రాజెక్టుకు 3,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

● ఎగువ మానేరు పరవళ్లు

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు పరవళ్లు కొనసాగుతున్నాయి. పల్వంచ, కూడవెల్లి వాగుల నుంచి వరద నీరు వస్తుండడంతో జలాశయం మత్తడి దూకుతోంది. మానేరు ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 2202 క్యూసెక్కులుగా కొనసాగుతోంది.

మంత్రివర్గ విస్తరణలో గిరిజనులకు చోటు

● ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ● ఎల్లారెడ్డిపేటలో ఉత్సాహంగా తీజ్



తీజ్ వేడుకల్లో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్, అధికారంలో గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వడంతో పాటు త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో గిరిజనులకు చోటు దక్కే అవకాశాలున్నాయని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్ అన్నారు. గిరిజన సంప్రదాయానికి ప్రతీకగా తీజ్ వేడుక నిలుస్తోందన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గిరిజనులు గురువారం తీజ్ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. సిరిసిల్ల నుంచి హైదరాబాద్‌కు ఎల్లారెడ్డిపేట మీదుగా వెళ్తున్న ఆయన స్థానికంగా జరిగిన తీజ్ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగంతో కలిసి పాల్గొన్నారు. గిరిజనులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. గిరిజన యువతులు, మహిళలతో కలిసి సందడి చేశారు. గోధుమ నారు బుట్టలను ఎత్తుకున్నారు. ఈ సందర్భంగా అద్దంకి దయాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రకృతిని ఆరాధించే పండుగ తీజ్ అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, గిరిజన నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గిరిధర్‌రెడ్డి, సూర్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇందిరమ్మ మోడల్ హౌస్ ప్రారంభం

ఎలిగేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ శుక్రవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ప్రారంభించడానికి అధికారులు సిద్ధంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా మండలంలోని 12 గ్రామాల్లో 292 గృహాలను మంజూరు చేసింది. ఒక్కో నిర్మాణానికి రూ.5 లక్షల నిధులను కేటాయించింది. ఈ నిధులతో ఇందిరమ్మ గృహ నిర్మాణం పూర్తవుతుందా, అదనపు నిధులు అవసరం ఉంటాయా అనే అనుమానాల వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సూచించిన కొలతలతో అంతే నిధులను వెచ్చించి ఇందిరమ్మ మోడల్ గృహాన్ని నిర్మించారు.

ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కమాన్‌పూర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని మంథని ఐసీడీఎస్ సీడీపీవో ఉప్పులేటి పుష్పలత తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో గర్భిణులకు, బాలింతలకు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. మూడు రోజులు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహణ జరుగుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో ఫేస్ రికగ్నిజేషన్ ఆధార్ కార్డు అప్‌డేట్ లేనివారు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్ మల్యాల భాగ్య పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభం



కబడ్డీ ఆడుతున్న తహసీల్దార్

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు గురువారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్ రావు ప్రారంభించారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. బాలికల విభాగంలో అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించిన అనంతరం ఎంపికైన విద్యార్థులు జోనల్ స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. ఎంఈవో సిరిమల్లె మహేష్, ప్రధానోపాధ్యాయులు సునీత, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి బండి కుమారస్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా

ఎలిగేడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరం మేరకు యూరియాను అందిస్తున్నామని పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయ భాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం సింగిల్ విండో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లోని రైతులు వరి పంటకు వేసుకునే యూరియాను సకాలంలో అందించాలని ఎమ్మెల్యే మండల వ్యవసాయ అధికారి సహకారంతో అందజేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 506.60 టన్నుల యూరియాను సంఘం పరిధిలో పంపిణీ చేసినట్లు చెప్పారు. యూరియా కొరత ఉందనే అపోహలను నమ్మవద్దని, అవసరం మేరకు రైతులు యూరియాను తీసుకు వెళ్లాలని అన్నారు. సీఈవో విక్రమ్ తదితరులు ఉన్నారు.

వైకుంఠ రథానికి విరాళం

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వైకుంఠరథంతోపాటు ఫ్రీజర్ కొనుగోలుకు కాల్వశ్రీరాంపూర్ చెందిన గోలి రమణయ్య రూ.50 వేలు విరాళంగా అందజేశారు. గురువారం శ్రీరాంపూర్ వైకుంఠ రథం ట్రస్టు బాధ్యులకు చెక్కును అందించారు. పొన్నమనేని దేవేందర్‌రావు, నక్కలగిరి, కనుకయ్య రూ.10 వేల చొప్పున విరాళం ఇచ్చారు. మీర్జంపేటకు చెందిన గూడపు సాంబశివరెడ్డి రూ.5 వేలు అందజేశారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలకు ఉపయో గించే వైకుంఠ రథానికి దాతలు విరాళాలు అందించాలని ట్రస్టు కన్వీనర్ మూల రమణారెడ్డి కోరారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, పులి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల మాక్ ఎన్నికలు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని రమేష్ నగర్ లోని ఉషోదయ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన విద్యార్థుల మాక్ ఎన్నికల ప్రక్రియ ఆకట్టుకుంది. ఈ ఎన్నికల్లో 8, 9 తరగతుల విద్యార్థులు హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌గా, డిప్యూటీ హెడ్‌బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్ స్థానాలకు పోటీ నిర్వహించగా విద్యార్థులు ఓటు వేశారు. హెడ్‌బాయ్‌గా కె.శరవణ్, హెడ్‌గర్ల్‌గా పి.లక్ష్మీప్రణతి, డిప్యూటీ హెడ్‌బాయ్‌గా అనిర్వేష్, ఎం.చతుర విజయం సాధించారు. కరస్పాండెంట్ కొత్త శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల విధానంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు సన్మానం

సుల్తానాబాద్, ఆగస్టు 21: (ఆంధ్రజ్యోతి): గర్రెపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గోల్డీ బల్బీర్ కౌర్‌కు కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. రిటైర్డు ప్రొఫెసర్ డాక్టర్ వి. శ్రీనివాస్ పర్యవేక్షణలో ద ఇమేజ్ ఆఫ్ న్యూ ఉమెన్ స్టడీ ఆఫ్ శోభడీ సెలెక్ట్ నావెల్స్ అనే అంశం పై పరిశోధన చేశారు. గురువారం మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌ను అధ్యాపకులు సన్మానించారు.

ఆస్తుల జప్తునకు కోర్టు ఆదేశం

కమాన్‌పూర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన గడ్డం కనకయ్య సింగరేణి ఉద్యోగి. కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామానికి చెందిన వైనాల రాజు అతని వద్ద కొంత డబ్బు అప్పుగా తీసుకున్నాడు. అతనికి సకాలంలో చెల్లించకపోవడంతో బాధితుడు మంథని కోర్టును ఆశ్రయించాడు. దీనిపై కోర్టు విచారణ చేసి బాధితుడు గడ్డం కనకయ్యకు రావాల్సిన అసలుతోపాటు వడ్డీ 12 శాతంగా నిర్ణయించింది. అయితే అతను వాటిని కట్టకపోవడంతో ఆస్తులను జప్తు చేయాలని గురువారం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆస్తుల జప్తునకు వైనాల రాజు ఇంటికి వెళ్లగా అక్కడ అతనికి సంబంధించిన చరాస్తి, బాకీదారునికి రావాల్సిన ఆస్తికి సరిపోకపోవడంతో కోర్టు సిబ్బందితోపాటు గడ్డం కనకయ్య వెనుదిరిగి వెళ్లారు.

సామాజిక సేవలకు గుర్తింపు

సుల్తానాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ప్రతినిధులను గురువారం కరీంనగర్‌లో నిర్వహించిన 320 జీ సమావేశంలో క్లబ్ అధ్యక్షుడు జూపల్లి తిరుమల్‌రావు, కార్యదర్శి ఎరబల్లి సుధీర్‌రావు, కోశాధికారి తమ్మనవేని సతీష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా తిరుమల్ రావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ జిల్లాతోపాటు రీజియన్‌లో సుల్తానాబాద్ ఉత్తమసేవా క్లబ్‌గా గుర్తింపు పొందిందన్నారు. జిల్లా గవర్నర్ కోదండ రాములు, పూర్వ ఇంటర్నేషనల్ డైరెక్టర్ రామకృష్ణమూర్తి, లయన్స్ ఇండియా కౌన్సిల్ చైర్మన్ బాబురావు, రీజియన్ చైర్మన్ రేకులపల్లి శశాంక, జోన్ చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, కోశాధికారి సాంబమూర్తి, డీకొండ భూమేష్, వినయ్, పిట్టల ప్రభాకర్, ఆసంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వయోవృద్ధాప్య దినోత్సవం

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి స్కూల్‌లో గురువారం ప్రపంచ వయోవృద్ధాప్య దినోత్సవం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ మంజులాశ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సీనియర్ సిటిజన్లు నేటి సమాజానికి మూలస్తంభాలని పేర్కొన్నారు. విద్యార్థులు పెద్దలను గౌరవించి పాదాభివందనం చేశారు.

గ్రామాల్లో గణాంక శాఖ సర్వే

పాలకుర్తి,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జయ్యారంలో గురువారం ప్రజా స్థితిగతులపై జాతీయ గణంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పట్టణాలు,గ్రామాలను ఎంపిక చేసుకొని ప్రజల ఉపాధిపై సర్వే చేపట్టినట్లు శ్రీనివాస్ తెలిపారు.

శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బారెడ్డి

సుల్తానాబాద్, ఆగస్టు 21: (ఆంధ్రజ్యోతి): వినాయక చవిత పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ సుబ్బారెడ్డి అన్నారు. సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతు పట్టణంలో, గ్రామాలలో గణేష్ మండపాలను ఏర్పాటు చేసే విషయాన్ని ముందుగా తెలుపాలని, డీజే సౌండ్స్ ఇతర అభ్యంతరకమైన వాటిని నిర్వహించవద్దని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సహకరించాలన్నారు. రాత్రి వేళల్లో మండపాల వద్ద నిర్వాహకులు ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు తావు లేదన్నారు. ఎస్ఐలు శ్రావణ్ కుమార్, వేణుగోపాల్, ఏఎస్ఐ కరుణాకర్ పాల్గొన్నారు.

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. గణపతి నవరాత్రులు ఆయా కాలనీలవాసులు ఐకమత్యంతో జరుపుకోవాలన్నారు. గోదావరిఖని పట్టణం వివిధ వర్గాల మధ్య ఐక్యతకు, అనుబంధాలకు ప్రతీక అని, దీన్ని కాపాడు కోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. మండప వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. నాణ్యమైన ఎలక్ట్రికల్ వైర్లను వాడాలని, అగ్ని ప్రమాద నిరోధక చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగే విధంగా రోడ్లపై మండపాలు ఏర్పాటు చేయవద్దని, అత్యవసరంగా మండపాల నుంచి బయ టకు వెళ్లే ఏర్పాట్లు ఉండాలన్నారు. డీజే సౌండ్ సిస్టం నిషేధమని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాల న్నారు. ఎస్ఐ రమేష్, మత పెద్దలు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో పలువురు వినాయక మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. విద్యుత్ అధికారుల అనుమతి తీసుకోవాలని, మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద, శోభాయాత్ర సమయాల్లో డీజేలకు అనుమతి లేదన్నారు. నిర్వాహకుల ఫోన్ నెంబర్లను మండపం వద్ద ఏర్పాటు చేయాలన్నారు.

మానకొండూరు ఎమ్మెల్యేను పరామర్శించిన మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణను గురువారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పరామర్శించారు. కరీంనగర్‌లో ఎమ్మెల్యే సత్యనారాయణ సోదరుడు రాజేశం మృతి చెందగా పరామర్శించారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ నాయకుడు

బీఆర్ఎస్ నాయకుడు వ్యాళ్ల హరీష్‌రెడ్డి గురువారం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణను కలిశారు. రామగుండం రాజకీయ, సామాజిక, పట్టణాభివృద్ధి లాంటి వివిధ అంశాలపై చర్చించి వారి సూచనలను, అనుభవాలను తెలుసుకున్నారు.

ఆకట్టుకున్న మ్యాథమెటిక్స్ వర్క్‌షాప్



విద్యార్థుల ప్రదర్శనలు చూస్తున్న ఏసీపీ

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): స్పందన మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో గురువారం సింగరేణి కమ్యూనిటీహాల్‌లో జరిగిన మ్యాథమెటిక్స్ వర్క్‌షాప్ ఆకట్టుకున్నది. ఆటలతో లెక్కలు, గణిత సూత్రాలు సులభ రీతిలో చేయడం వంటి విద్యార్థుల ప్రదర్శనలు ఇచ్చారు. ఎన్‌సీఆర్‌టీ సభ్యుడు సత్యనారాయణశర్మ నాలుగు రోజుల పాటు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమానికి ఏసీపీ మడక రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హైస్కూల్ దశలో ఎక్కువ మంది విద్యార్థుల్లో మ్యాథ్స్ సబ్జెక్టుపై భయం ఉంటుందని, సులభ రీతిలో సబ్జెక్టులో రాణించేలా ఇచ్చిన శిక్షణ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, ట్రస్మా సభ్యులు అమరేందర్, విజయానందర్, కరస్పాండెంట్ ఓదేలు, ప్రిన్సిపాల్ రవీందర్‌రావు పాల్గొన్నారు.

దేశంలో నిరంకుశ పాలన కొనసాగుతుంది



సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దేశంలో నిరంకుశ పాలన కొనసాగుతుందని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపథం రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో ఎన్నికల కమిషన్ పూర్తిగా వైఫల్యం చెందిందని, బీహార్‌లో 60లక్షల ఓట్లను తొలగించి బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఎన్నికలు జరిగే విధంగా చేసిం దన్నారు. ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి కొమ్ము కాస్తుందన్నారు. ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం దేశంలోని స్వతంత్ర సంస్థలను గుప్పిట్లో పెట్టుకుని వ్యవస్థను నిర్వీర్యం చేసే పరిస్థితికి వచ్చిందని, ప్రశ్నించే గొంతుల ను లేకుండా చేస్తుందన్నారు. తెలంగాణ రైతాంగానికి 15లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా అవసరం ఉండగా కేవలం 7లక్షల టన్నుల యూరియా కేటాయిం చడం సరికాదని, రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చా లని డిమాండ్ చేశారు. రమ, నంది రామయ్య, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

పనుల జాతరలో భాగస్వాములను చేయాలి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో భాగంగా శుక్రవారం చేపట్టనున్న పనుల జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతోపాటు ప్రతీ ఒక్కరిని భాగస్వాములను చేయాలని ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ అన్నారు. గురువారం కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. పనుల ప్రారంభోత్సవం, ఇందిరమ్మ మహిళ శక్తి, ఉపాధి భరోసా కింద చేపట్టే జీవనోపాధి అభివృద్ధి పనులు, స్వయం సహాయ మహిళ సంఘాలకు పశువుల కొట్టాల నిర్మాణం, షెడ్ల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులు అందించనున్నట్లు తెలిపారు. ఎంపీవో ఫయాజ్, ఏపీవో రమేష్‌బాబు, ఈజీఎస్ జేఈ రాజయ్య పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎంపీడీవో తిరుపతి తెలిపారు. గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడి భవనాల నిర్మాణానికి శంకుస్థాపన పనులను ప్రారంభిస్తారని ఎంపీడీవో తెలిపారు.

దివ్యాంగురాలికి అండగా ఆలయ ఫౌండేషన్



వ్యుత్తారం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంపల్లికి చెందిన పార్శ లక్ష్మి కొన్నేళ్ల క్రితం ప్రమాదవశాత్తు ఎడమకాలు కోల్పోయింది. కృత్రిమ కాలు పెట్టుకునే స్థోమత లేకపోవడంతో ఆలయ ఫౌండేషన్ సభ్యులు కీర్తినాగార్జునను లక్ష్మి కుటుంబ సభ్యులు సంప్రదించారు. ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరికి తెలుపగా హైదరాబాద్‌లోని భగవాన్ మహావీర్ వికలాంగ్ సమస్థాన సహకారంతో బుధవారం కృత్రిమ కాలును ఉచితంగా పెట్టిం చారు.

కొత్త రేషన్ కార్డుల పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ 18వ డివిజన్ హనుమాన్‌నగర్‌లో గురువారం కొత్తగా రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు కార్డులను అందజేశారు. పదేళ్లకుపైగా రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్న గతంలో గెలిచిన నాయకులు ప్రభుత్వాలు పట్టించుకోలేదని, కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో భాగంగా అర్హులైన వారందరికి రేషన్ కార్డులు మంజూరు అయినట్లు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండేటి రాజేష్ అన్నారు. డివిజన్ ఇన్‌చార్జి దేవనపల్లి చక్రపాణి, రేషన్ షాప్ డీలర్ రాయమల్లుతో పాటు కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు

పాలకుర్తి,ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):మండలం పరిధిలోని బామ్లానాయక్ తండాలో గురువారం మాజీ సర్పంచ్ బదావత్ రాజునాయక్ ఆధ్వర్యంలో ఘనంగా తీజ్ ఉత్సవాలు జరిగాయి. వారం రోజుల క్రితం గోధుమ విత్తనాలు నాన పోసి నీళ్లు పోసి నారు పెరిగేల చేశారు. ఉత్సవాల్లో మహిళలు మొలకెత్తిన నారును నెత్తిన పెట్టుకొని నృత్యాలు చేశారు. ఎస్ఐ ఆర్ స్వామి, బదావత్ మోతిలాల్, బానోతు జయపాల్, ఇస్లావత్ సామ్యూల్, రాజునాయక్, భూక్య జమున, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారేడుగొండ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన వెంకట్రావుపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసి, ముగ్గు పోసే కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని వారు సూచించారు. యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు అరగొండ రాజ్ కుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు దాసరి కిషన్,మద్దెల మల్లయ్య, ఆకుల రాములు, నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి బహిష్కరణ

గోదావరిఖని, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు ఆ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి చంద్రన్న ఒక ప్రకటనలో తెలిపారు. అశోక్‌ను పార్టీ ప్రాథమిక సభ్యత్వం, ఏసీ కమిటీ, కేంద్ర, రాష్ట్ర కమిటీల నుంచి బహిష్కరిస్తున్నట్టు ఆయన చెప్పారు. గురువారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో అశోక్ కొంత కాలంగా పార్టీకి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు ఆరోపించారు. 2022లో ఫారెస్ట్ ఉద్యమంలో రహస్య ఉద్యమాలు నిర్వహిస్తున్న అశోక్‌ను రాష్ట్ర కార్యదర్శిగా నియమించామన్నారు. అశోక్ అరెస్టు అయి బెయిల్‌పై బయటకు వచ్చిన తరువాత ఆయన విధానంలో మార్పు మొదలైందన్నారు. గతేడాది మే 12న రాష్ట్ర కమిటీ కొన్ని నిర్ణయాలు చేసిందని, వాటిని జిల్లా కమిటీలకు తెలుపడంలో, అమలు చేసే విషయంలో అశోక్ నిర్లక్ష్యం చేశాడని చంద్రన్న ఆరోపించారు. అశోక్ సొంతంగా జనరల్ బాడీలను నిర్వహించి పోటీ జిల్లా కమిటీలను ఏర్పాటు చేశారని, జూలైలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశానికి గైర్హాజర్ అయ్యారని చెప్పారు. విలాసవంతమైన అలవాట్లకు బానిసైన అశోక్‌ను పార్టీ నుంచి బహిష్కరించామన్నారు. ఖమ్మం, వరంగల్ ఏరియా కమిటీ పరిధిలో ఎవరూ అశోక్‌కు సహకరించవద్దని ఆ ప్రకటనలో చంద్రన్న స్పష్టం చేశారు.



కాంట్రాక్టు కార్మికుల సదస్సును విజయవంతం చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ స్కీం వర్కర్లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 7న హైద్రాబాద్‌లో జరగనున్న సదస్సును విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ జనరల్ సెక్రెటరీ వెంకన్న, వైస్ ప్రెసిడెంట్ అశోక్‌లు పిలుపునిచ్చారు. గురువారం ఆర్జీ-2 ఏరియాలోని వివిధ సెక్షన్లలో జరిగిన సమావేశాల్లో మాట్లాడారు. సింగరేణిలో సుమారు 30వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారని, 2013 నుండి హైపవర్ వేతనాలు ఇచ్చేలా ఒప్పందం జరిగినా యాజమాన్యం అమలు చేయలేదన్నారు. హైపవర్ వేతనాలతోపాటు హక్కులు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రమేష్, లింగయ్య, రాజనర్సు, సంపత్, సతీష్ పాల్గొన్నారు.

పార్కును ప్రారంభించిన డైరెక్టర్



పార్కులో మొక్కలు నాటుతున్న డైరెక్టర్ సత్యనారాయణ

గోదావరిఖని, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పవర్‌హౌస్ దుర్గామాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పార్కును గురువారం సింగరేణి డైరెక్టర్ (ఈ అండ్‌ఎం)డీ సత్యనారాయణరావు దంపతులు ప్రారంభించారు. ఆలయ వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికి అమ్మవారికి అర్చన అభిషేకం నిర్వహించారు. అనంతరం రాజీవ్ రహదారి పక్కన పార్కులో మొక్కలు నాటారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ షెడ్డు శంకుస్థాపన చేశారు. డైరెక్టర్ సత్యానారాయణరావు దంపతులను శాలువాలతో సన్మానించారు. డైరెక్టర్ మాట్లాడుతూ పార్కులో రూ.5లక్షల వ్యయంతో వివిధ రకాల మొక్కలతో ఏర్పాటు చేశామని తెలిపారు. సీఎంఓఏఐ నాయకులు మల్లేష్, ఎస్‌ఓటూ జీఎం ఆంజనేయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, డీజీఎం ఫైనాన్స్ ధనలక్ష్మి బాయి, ఏజెంట్స్ చిలక శ్రీనివాస్, ఎల్ రమేష్, ఏరియా ఇంజనీర్ రమేష్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ హన్మంతరావు, అధికారులు బీమా జితేందర్ సింగ్, కర్ణ, వరప్రసాద్, నాగేశ్వరరావు, వీరారెడ్డి, పాల్గొన్నారు.

మ్యాచింగ్ గ్రాంట్ చెక్కు అందజేత

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ప్రాజెక్టుకు చెందిన సామల రామ్మూర్తి కుటుంబ సభ్యులకు గురువారం అధికారులు మ్యాచింగ్ గ్రాంట్ చెక్కును అందజేశారు. ఈపీ గ్రీసర్ హెల్పర్ అయిన రామ్మూర్తి డ్యూటీలో గుండె పోటుతో మృతి చెందగా మ్యాచింగ్ గ్రాంట్ కింద రూ.15.36 లక్షల చెక్కును అధికారులు రామ్మూర్తి సతీమణి లావణ్యకు అందజేశారు. ఓసీపీ-3 మేనేజర్ భరత్‌కుమార్, ఏఐటీయూసీ బ్రాంచి అసిస్టెంట్ సెక్రెటరీ శ్యాంసన్, ఆఫీసర్లు సాయికృష్ణ, అజీజ్ పాల్గొన్నారు.

ఆర్జీ-2 యాజమాన్యంతో సీఎంపీఎఫ్ కమిషనర్ సమావేశం



ఆర్జీ-2 అధికారులతో చర్చిస్తున్న సీఎంపీఎఫ్ కమిషనర్

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సీఎంపీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రయాస్ కార్యక్రమంలో భాగంగా గురువారం సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ గోవర్ధన్ ఆర్జీ-2 అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏరియా అధికార ప్రతినిధి అరవిందరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెన్షన్‌దావాల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కమిషనర్ మాట్లాడుతూ భవిష్య నిధి(ప్రావిడెంట్ ఫండ్), పెన్షన్‌దావాలను తక్షణ పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవడం ద్వారా జీరో పెండెన్సీ సాధించడం లక్ష్యమన్నారు. సింగరేణి ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులకు సంబంధించిన సీఎంపీఎఫ్ నంబర్ అలాట్‌మెంట్, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు క్లయిమ్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్జీ-2 డీజీఎం పర్సనల్ అరవిందరావు కోరారు. సింగరేణి ఉద్యోగులకు జాప్యం లేకుండా సీఎంపీఎఫ్‌ను త్వరితగతిన చెల్లించడానికి కృషి చేయనున్నట్లు, దళారుల ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకంగా సేవలను అందజేయనున్నట్టు సీఎంపీఎఫ్ కమిషనర్ పేర్కొన్నారు. ఆర్జీ-2 ఏరియాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 10 సీఎంపీఎఫ్ కేసులపై సమావేశంలో చర్చించారు. సాధన్, సాయికృష్ణ, అజీజ్, నరేష్, రమేష్‌కుమార్, కమలేష్‌రావు, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

యూరియా అమ్మకాలపై నిఘా!

(5వ పేజీ తరువాయి)

ఏప్రిల్ నెలలో 719 టన్నులు, మేలో 317 టన్నులు, జూన్‌లో 1816 టన్నులు, జూలైలో 4,978 టన్నులు, సెప్టెంబర్‌లో 13,607 టన్నుల యూరియా రావాల్సి ఉంది. అయితే ప్రస్తుత సాగుకు 28,195 టన్నుల యూరియానే ప్రామాణికంగా అధికారులు తీసుకుంటున్నారు. ఆ లెక్కన ఇప్పటి వరకు జిల్లాకు 21,581 టన్నుల యూరియా సరఫరా అయ్యిందని, 18,991 టన్నుల యూరియాను రైతులు కొనుగోలు చేశారని, సహకార సంఘాలు, ఎరువుల దుకాణాల్లో 2,590 యూరియా నిల్వలు ఉన్నాయని, ఇంకా 6,614 అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాకు వస్తున్న యూరియాను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 60 శాతం వరకు కేటాయిస్తుండగా, ప్రైవేట్ వ్యాపారులకు 40 శాతం యూరియాను ఇస్తున్నారు. అయితే రైతులు అవసరానికి మించి యూరియాను నిల్వ చేసుకుంటున్నారని భావిస్తున్న అధికారులు ఎకరానికి ఒక బస్తా యూరియా మాత్రమే విక్రయించే విధంగా చర్యలు చేపట్టారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం తీసుక వస్తేనే యూరియా ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఏ రైతుకు విక్రయించారో రిజిష్టర్‌లో వివరాలు రాయాలని ఆదేశించారు. జిల్లాలో ఆర్ఎఫ్‌సీఎల్ ఉన్న కారణంగా జిల్లాకు ముందుగా నిర్దేశించిన కోటా ప్రకారం యూరియా సరఫరా అవుతున్నది. దీంతో రైతులకు పెద్దగా యూరియా కొరత లేకుండా పోతున్నది. దీనికితోడు కొందరు రైతులు నానో యూరియా వాడుతుండడంతో కొరత ఏర్పడే అవకాశాలు లేవు. రైతులు అవసరానికి మించి కొనుగోలు చేయకుండా, ఇతర జిల్లాలకు పక్కదారి పట్టకుండా ఉండేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఎరువుల దుకాణాలు, సహకార సంఘాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



మొక్కను నాటిన జిల్లా ఉద్యానవన అధికారి

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యావన శాఖ అధికారి జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం పెద్దరాత్‌పల్లిలోని ఎల్లంకి శ్రీనివాస్ వ్యవసాయ క్షేత్రంలో 42 ఎకరాల్లో మొక్కలు నాటారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మాట్లాడుతూ మొక్కలు నాటేప్పుడు గుంతల్లో 250 గ్రాముల డీఏపీ, వేప పిండి, వర్మి కంపోస్టు వేయాలని తెలిపారు. మోతాదుకు మించి ఎరువులను వాడకూడదన్నారు. జనుము, జీలుగలాంటి మొక్కలు నాటితే ఉష్ణోగ్రత తగ్గించి మొక్క ఆరోగ్యంగా పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. మూడేళ్ల వరకు మొక్కల మధ్యలో అంతర పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. పంట సాగు చేస్తే ఎకరానికి రూ.4200 సబ్సిడీ నాలుగేళ్లు వస్తుందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి నాగార్జున, ఏఈఓ ఈశ్వర్, హెచ్‌ఈఓబి రాము, తిరుమల అయిల్ కెమ్ ఇండియా కంపెనీ సీఈఓ కేశు కళ్యాణ్ కర్, ఫీల్డ్ ఆఫీసర్ అజయ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సీపీఎం పోరాటం



కాకర్లపల్లిలో పర్యటించిన సీపీఎం నేతలు

మంథని/మంథనిరూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం పార్టీ నిరంతరం పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీ. నాగయ్య స్పష్టం చేశారు. మంథనిలో ప్రజా సంఘాల కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. సూరయ్యపల్లి, కాకర్లపల్లి గ్రామాల్లో సీపీఎం బృందంతో కలిసి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. రెడ్డి చెరువు ప్రభుత్వ భూములను కాకర్లపల్లి దళిత కుటుంబాలకు ఇవ్వాలని, సూరయ్యపల్లిలోని ముదిరాజ్ కుటుంబాలకు చేపలు పట్టుకోవటానికి చెరువు లేదని, వీరికి జీవనాధారం కల్పించాలన్నారు. వై.యాకయ్య, కుమారస్వామి, బూడిద గణేష్, ఆర్ల సందీప్, మంథని లింగయ్య, సురేష్‌లు పాల్గొన్నారు.

పంటలపై అవగాహన

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పంటల సస్యరక్షణపై శాస్త్రవేత్త సతీష్‌చంద్ర అవగాహన కల్పించారు. జాఫర్‌ఖాన్‌పేట శివారులో పత్తి, పసుపు, వరి పంటలను గురువారం పరిశీలించారు. పంటలను కాపాడుకునే విధానం, పురుగుమందులపై వివరించారు. నాగార్జున, సంకీర్తన ఉన్నారు.

లాభాల వాటాను ప్రకటించాలి



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరం లాభాల వాటాను ప్రకటించాలని బీఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం ఓసీపీ-1 సీహెచ్‌పీలో జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా సంస్థ నిర్వహిస్తున్న స్కూల్స్‌లో సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేయాలని, కార్పొరేట్ ఆసుపత్రిని నిర్మించాలని సత్తయ్య డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలు సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని, సొంతింటి పథకం అమలు చేయాలని, లాభాల వాటాలో 40శాతం కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సారంగపాణి, వేణుగోపాల్‌రావు, ప్రసాద్, రమేష్, పాల్గొన్నారు.